క్లుప్తంగా

పాఠశాలకు గ్రీన్ బోర్డులు అందజేత



కొత్తకోట రూరల్: మండలంలోని రామనంతాపురం ప్రాథమిక పాఠశాలకు గ్రామానికి చెందిన యువకుడు, తెలంగాణ ఉద్యమకారుడు టీజీ మహేష్ సొంత డబ్బులతో రెండు గ్రీన్ బోర్డులను అందజేశారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు శేఖర్‌గౌడ్, గ్రామస్తులు పెద్ది మహేష్, కొత్త కాపు మహేశ్వర్‌రెడ్డి, ఏషమోని రాములు విద్యార్థులు తదితరులు ఉన్నారు.

హైమాస్ట్ లైట్ల ఏర్పాటు

వీపనగండ్ల: రాష్ట్ర ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు సహకారంతో శనివారం కల్వరాల గ్రామంలో హైమాస్ట్ లైట్లతో పాటు ఎల్‌ఈడీ లైట్లను ఏర్పాటు చేసినట్లు నాగర్‌కర్నూల్ జిల్లా పర్యాటక శాఖ అధికారి నర్సింహ తెలిపారు. గ్రామంలో ఎన్నో రోజులుగా పలు వీధులు చీకటిమయంగా ఉన్న విషయాన్ని మంత్రి దృష్టికి తీసుకువెళ్లగా.. స్పందించిన మంత్రి గ్రామంలో రెండు చోట్ల నిరుపయోగంగా ఉన్న హైమాస్ట్ లైట్ల పరికరాలను వినియోగంలోకి తేవాలని, అలాగే వీధుల్లో 150 వీధిలైట్లను ఏర్పాటు చేయాలని ఆదేశించారన్నారు.

కలెక్టరేట్ ఏఓపై ఫిర్యాదు

వనపర్తి: కలెక్టరేట్ ఏఓ భానుప్రకాష్ గత శాసనసభ, పార్లమెంట్ ఎన్నికల సమయంలో తమపై వివక్ష చూపించి అతి తక్కువ అలవెన్స్ ఇచ్చారని కలెక్టరేట్ రెవెన్యూయేతర ఉద్యోగులు ఈ నెల 19వ తేదీన సచివాలయం ప్రజావాణి, రాష్ట్ర ఎన్నికల కమిషన్‌కు లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేశారు. రెవెన్యూశాఖ ఉద్యోగులు సిబ్బందికి రూ.18,500, రెవెన్యూయేతర ఉద్యోగులకు రూ.7,500 మాత్రమే ఇచ్చారని ఫిర్యాదులో పేర్కొన్నారు. కొన్ని బోగస్ బిల్లులతో నిధులు డ్రా చేసినట్లు ఫిర్యాదులో వెల్లడించారు. ఈ విషయంపై సమగ్ర విచారణ చేయాలని కలెక్టరేట్ రెవెన్యూయేతర ఉద్యోగులు రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు, సచివాలయం ప్రజావాణి ఇన్‌చార్జ్ డాక్టర్ జి. చిన్నారెడ్డిని, రాష్ట్ర ఎన్నికల కమిషన్‌ను కోరినట్లు ఫిర్యాదు ప్రతులు చూపించారు.

ఆటల పోటీలు

అమరచింత: పట్టణానికి చెందిన మాజీ అడ్వకేట్ జనరల్ దేశాయి ప్రకాష్‌రెడ్డి పుట్టిన రోజును పురస్కరించుకుని పట్టణంలోని ప్రభుత్వ పాఠశాల, ప్రైవేట్ పాఠశాల విద్యార్థులకు శనివారం ఆటపోటీలు నిర్వహించారు. ఆటపోటీలను మున్సిపల్ చైర్‌పర్సన్ మంగమ్మ చేతుల మీదుగా ప్రారంభించారు. ఈమేరకు దేశాయి ప్రకాష్‌రెడ్డి సేవా సమితి అధ్యక్షుడు సయ్యద్ కలాంపాషా మాట్లాడుతూ డిసెంబర్ 31న ప్రతి సంవత్సరం విద్యార్థులకు ఆటపోటీలు నిర్వహించి, గెలుపొందిన వారికి బహుమతులను అందచేస్తున్నట్లు తెలిపారు.

విద్యార్థులు దేశం గర్వించే స్థాయికి ఎదగాలి

ఆత్మకూర్: ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య అందుతుందని, విద్యార్థులు బాగా చదివి దేశం గర్వించే స్థాయికి ఎదగాలని ప్రవాస భారతీయుడు కృష్ణబాబు అన్నారు. శనివారం మండలంలోని పిన్నంచర్ల ప్రభుత్వ పాఠశాలలో గ్రామానికి చెందిన చంద్రశేఖర్ రెడ్డి, వందనమ్మ దంపతుల కుమారుడు ఎన్‌ఆర్‌ఐ కృష్ణబాబు విద్యార్థులకు క్రీడా సామగ్రి అందజేశారు.

చిన్నారులకు పలకలు పంపిణీ

పిన్నంచర్ల అంగన్‌వాడీ కేంద్రాల్లోని చిన్నారులకు సింగిల్‌విండో డైరెక్టర్ అజ్జపాగ మాసన్న, సరిత దంపతుల ఆధ్వర్యంలో తమ కుమారుడు వివేక్ పుట్టినరోజు సందర్భంగా పలుకలు, నోట్‌బుక్కులు, పెన్నులు, చాక్లెట్లు పంచారు.

గాయపడిన కృష్ణజింక

ఆత్మకూర్: మండలంలోని పిన్నంచర్ల సమీపంలోని పద్మావతి గార్డెన్ పరిసరాల్లో శనివారం సాయంత్రం కృష్ణ జింక కాలికి గాయాలై పడి ఉండడాన్ని ఆత్మకూర్ వైపుగా వెళ్తున్న యువకులు గమనించారు. వెంటనే జింకకు సపర్యలు చేసి ఎస్‌ఐ నరేందర్‌కు సమాచారం ఇవ్వడంతో ఘటన స్థలానికి చేరుకుని ఫారెస్టు అధికారులకు సమాచారం అందించారు. ఫారెస్టు డిప్యూటీ రేంజ్ ఆఫీసర్ రజనీకాంత్ బృందం చేరుకుని జింకకు వైద్య చికిత్సలు అందించి మహబూబ్‌నగర్ పిల్లలమర్రి మినీ జూపార్క్‌కు తరలించి అక్కడి ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ ఫర్వేజ్‌అహ్మద్‌కు కృష్ణ జింకను అప్పగించారు. యువకులు ఖాజన్న, నరేష్, అంజి, వెంకటేష్, రాజ్‌కుమార్, నందు ను అధికారులు అభినందించారు.

‘ఇందిరమ్మ ఇళ్ల సర్వేలో జాప్యమొద్దు’

- అనధికారిక సెలవుల్లో వెళ్లే పంచాయతీ కార్యదర్శులపై చర్యలు
- ప్రతి రోజు మండల స్థాయి అధికారులు పర్యవేక్షించాలి
- కలెక్టర్ ఆదర్శ్ సురభి



కల్వరాలలోని కొనుగోలు కేంద్రంలో రికార్డులను పరిశీలిస్తున్న కలెక్టర్ ఆదర్శ సురభి

పాన్‌గల్: గ్రామాల్లో నిర్వహిస్తున్న ఇందిరమ్మ ఇళ్ల సర్వేను నిర్దేశించిన సమయానికి పూర్తి చేయాలని కలెక్టర్ ఆదర్శ్ సురభి అధికారులను ఆదేశించారు. శనివారం మండలంలోని అన్నారంతండా, కేతేపల్లి గ్రామాల్లో సర్వేను ఆయన పరిశీలించారు. పంచాయతీ కార్యదర్శులు, ఇతర సిబ్బంది విధుల్లో పాల్గొనకుండా అనధికారిక సెలవుల్లో ఉంటే వారిపై చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. అన్నారం తండాలో సర్వేలో ఉన్న పంచాయతీ కార్యదర్శి వద్ద ఇందిరమ్మ ఇళ్ల జాబితా లేకపోవడంపై కలెక్టర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. సిబ్బంది వద్ద తప్పనిసరిగా సర్వేకు సంబంధించిన ఇళ్ల జాబితా ఉండాలని సూచించారు. మండలంలో ఇప్పటి వరకు 47 శాతం మాత్రమే సర్వే పూర్తైందని, వేగం పెంచాలన్నారు. తహసీల్దార్ సత్యనారాయణరెడ్డి, ఎంపీడీఓ గోవింద్‌రావు, ఎంపీఓ రఘురాములు, ఆర్‌ఐ మహేష్, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

కఠిన చర్యలు తప్పవు

వీపనగండ్ల: ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను అర్హులకు అందించేందుకు పనిచేయాల్సిన ఉద్యోగులు అనధికారిక సెలవుల్లో ఉంటున్నారని, అలాంటి వారిని వెంటనే సస్పెండ్ చేయాలని కలెక్టర్ ఆదర్శసురభి ఎంపీడీఓకు ఆదేశించారు. శనివారం మండల కేంద్రంతో పాటు కల్వరాలలో వరి కొనుగోలు కేంద్రం, ఇందిరమ్మ ఇళ్ల సర్వేతో పాటు కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌ను ఆయన ఆకస్మికంగా సందర్శించారు. ఇందిరమ్మ ఇళ్ల సర్వే సిబ్బందికి ప్రతి రోజు అవసరమైన సూచనలు ఇవ్వాలని ఆయన ఉన్నతాధికారులను ఆదేశించారు. కల్వరాలలోని వరి కొనుగోలు కేంద్రంలో రైతుల వివరాలు సిబ్బంది వద్ద ఉండాలని, తేమ శాతం వచ్చిన వెంటనే ధాన్యాన్ని మిల్లర్లకు పంపించి, రైతులకు సంబంధిత రశీదులు అందజేయాలన్నారు. మండల కేంద్రంలోని కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌లో రోజువారి రోగుల జాబితాను పరిశీలించి, మెరుగైన వైద్యం అందించాలని వైద్యులకు సూచించారు. ఆస్పత్రికి అవసరమైన అంబులెన్స్‌ను త్వరగా ఏర్పాటు చేసేందుకు జిల్లా కమ్యూనిటీ ఆస్పత్రి కోఆర్డినేటర్ చైతన్యగౌడ్‌తో ఆయన ఫోన్‌లో మాట్లాడారు. కార్యక్రమంలో ఎంపీడీఓ శ్రీనివాసరావు, వ్యవసాయాధికారి డాకేశ్వర్‌గౌడ్, వైద్యాధికారి రాజశేఖర్, పలువురు అధికారులు పాల్గొన్నారు.

పుర సభలో ‘చౌరస్తా’ల రభస



మాజీ ప్రధాని మన్మోహన్‌సింగ్‌కు సంతాపం తెలుపుతున్న మున్సిపల్ చైర్మన్, వైస్ చైర్మన్

- అధికార, విపక్షాల మధ్య వాగ్వాదం
- మున్సిపల్ డీఈ పొంతన లేని సమాధానాలతో దుమారం
- సంతాప దినాల్లో సమావేశం పెట్టడంపై తీవ్ర విమర్శలు

వనపర్తి టౌన్: స్థానిక పుర సమావేశంలో చౌరస్తాల రభస రాజుకుంది. శనివారం మున్సిపల్ చైర్మన్ మహేష్ అధ్యక్షతన మున్సిపల్ సాధారణ సమావేశం నిర్వహించారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ఏర్పాటు చేసిన అంబేడ్కర్, గాంధీ విగ్రహాల చౌరస్తాలకు అనుగుణంగా ఏర్పాటు చేయలేదని, విగ్రహాలను కొద్దిపాటి స్థాన చలనం కలిగించేందుకు అజెండాను ప్రవేశ పెట్టడంతో బీఆర్ఎస్ సభ్యులు బండారి కృష్ణ, లక్ష్మీనారాయణ, నాగన్నయాదవ్ తీవ్ర అభ్యంతరం తెలిపారు. విగ్రహాలను కదల్చడం సరైంది కాదని, నిధుల దుర్వినియోగం అవుతాయని బీఆర్ఎస్ కౌన్సిలర్లు మండిపడ్డారు. పలువురు బీఆర్ఎస్ కౌన్సిలర్లు మాట్లాడుతూ బీఆర్ఎస్ పాలనలోనే జిల్లా కేంద్రంలో రోడ్ల విస్తరణ పూర్తి చేశామని, మిగిలిపోయిన కొద్దిపాటి పనులను అధికార పార్టీ నాయకులు పూర్తి చేయలేని స్థితిలో ఉన్నారని దుయ్యబట్టారు. ఈ క్రమంలో కలుగజేసున్న మున్సిపల్ చైర్మన్ నిధులు లేకపోయినా ఎలాగోలా చేస్తామని చెప్పడంపై అభ్యంతరం వ్యక్తం చేశారు. ఈ క్రమంలోనే కాంగ్రెస్ సభ్యులు విభూది నారాయణ, చీర్ల సత్యం విగ్రహాల స్థాన చలనం సమర్థించడంతో బీఆర్ఎస్ సభ్యుడు బంగారి కృష్ణ, కాంగ్రెస్ సభ్యులు పరుషపదజాలంతో దూషించుకున్నారు.

పొంతన లేని సమాధానం

గ్రీన్ బడ్జెట్‌పై సభ్యులు అడిగిన ప్రశ్నలకు డీఈ యూనుస్ పొంతనలేని సమాధానం చెప్పడంతో మరోసారి దుమారం రేగింది. ఈ నేపథ్యంలోనే వైస్ చైర్మన్ పాకనాటి కృష్ణ సభ్యులకు బదులిస్తుండటంతో బీఆర్ఎస్ సభ్యులు లక్ష్మీనారాయణ అడ్డుతగిలాడు. ప్రతి విషయంలో వైస్ చైర్మన్ సమాధానం ఇవ్వడం ఏంటని, చైర్మన్, అధికారులు ఎందుకు ఉన్నారని ప్రశ్నించారు. అనంతరం బీఆర్ఎస్ సభ్యులు అలేఖ్య, ఇతర కౌన్సిలర్లు ఆయా వార్డుల్లో నెలకొన్న సమస్యలు పరిష్కరించాలని చైర్మన్‌కు వినతిపత్రం అందజేశారు. అంతకు ముందు వైస్ చైర్మన్ పాకనాటి కృష్ణ కమిషనర్ తీరుపై అభ్యంతరకర వ్యాఖ్యలు చేశారు. మాజీ చైర్మన్ గట్టుయాదవ్, మాజీ వైస్ చైర్మన్ వాకిటి శ్రీధర్‌తో పాటు కమిషనర్ పూర్ణచందర్ సమావేశానికి హాజరు కాలేదు.

మాజీ ప్రధాని మన్మోహన్‌కు సంతాపం

మాజీ ప్రధాని మన్మోహన్‌సింగ్ మృతికి సభ ప్రారంభంలోనే సంతాపం ప్రకటించాల్సి ఉన్నప్పటికీ.. ఆ దిశగా ముందుకు వెళ్లలేదు. సమావేశం ముగిశాక కొందరు సభ్యులు మాజీ ప్రధానికి సంతాపం తెలుపరా? అని అడుగగా.. సగం మంది సభ్యులు వెళ్లిపోయాక ఉన్న సభ్యులతో కలిసి మున్సిపల్ చైర్మన్ మాజీ ప్రధానికి సంతాపం తెలిపారు.

కొనసాగుతున్న రిలే నిరాహార దీక్షలు

వనపర్తి రూరల్: సీపీఎం పట్టణ కమిటీ ఆధ్వర్యంలో కురుమయ్య, పలువురు నాయకులు శనివారం జిల్లా కేంద్రంలోని మర్రికుంట ధర్నాచౌక్‌లో పట్టణ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ మూడో రోజు రిలే నిరాహార దీక్షలు కొనసాగించారు. ఈ సందర్భంగా కురుమయ్య మాట్లాడుతూ.. వనపర్తి పట్టణంలో ప్లాట్లు ఉన్న నిరుపేదలకు రాష్ట్ర ప్రభుత్వం రూ.5 లక్షలు, కేంద్ర ప్రభుత్వం రూ.10 లక్షలు ఇవ్వాలన్నారు. అదేవిధంగా ప్లాట్ లేని వారికి ఇందిరమ్మ ఇల్లు ఇవ్వాలని, రోడ్ల నిర్మాణం పూర్తి చేసి, రోడ్డు విస్తరణలో నష్టపోయి వారందరికీ పరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పట్టణ కార్యదర్శి పరమేశ్వరాచారి, గంధం మదన్, గట్టయ్య, రమేష్, బీసన్న, బాలస్వామి, బాలపీరు, సాయిలీల, కవిత, ఉమ, లక్ష్మి, శ్యామల, పార్వతి, నందిమళ్ల రాములు, మద్దిలేటి పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలకు పరామర్శ

పాన్‌గల్: మండలంలోని కదిరెపాడు, గురిగింజమిట్టతండాకు చెందిన పలు కుటుంబాలను శనివారం గ్రంథాలయ సంస్థ జిల్లా చైర్మన్ గోవర్ధన్‌సాగర్, కాంగ్రెస్ మండల నాయకులు పరామర్శించి, ఆర్థికసాయం అందజేశారు. కదిరెపాడుకు చెందిన లక్ష్మమ్మ, బాలకిష్టమ్మ ఇటీవల అనారోగ్యంతో బాధపడుతూ మృతి చెందడంతో ఒక్కొక్కరికి రూ.5 వేలు చొప్పున అందించారు. గురిగింజమిట్ట తండాకు చెందిన ముడావత్ నర్సింహానాయక్ కుటుంబాన్ని పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. కార్యక్రమంలో వెంకటేష్‌నాయుడు, రవికుమార్, మధుసూదన్‌రెడ్డి పాల్గొన్నారు.

10 లీటర్ల సారా పట్టివేత

వనపర్తి రూరల్: మండలంలోని చిట్యాల సమీపంలో పడమటి తండా నుంచి వస్తున్న కేతావత్ దీప్లా బైక్‌ను పోలీసులు తనిఖీ చేయగా క్యాన్‌లో 10 లీటర్ల సారా గుర్తించారు. దీప్లా అదుపులోకి తీసుకొని కేసు నమోదు చేశామని వనపర్తి ఎక్సైజ్ ఎస్‌ఐ సంధ్యారాణి తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎక్సైజ్ జిల్లా సూపరింటెండెంట్ శ్రీనివాసులు ఆదేశాల మేరకు శనివారం వనపర్తి మండలంలో తనిఖీలు నిర్వహించామన్నారు. తండాల్లో ఎవరైనా సారా తయారు చేసినా.. విక్రయించినా వారిపై చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఎక్సైజ్ సిబ్బంది శేఖర్, సత్యనారాయణగౌడ్ పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో శ్రీకృష్ణ విగ్రహ ఊరేగింపు



శ్రీకృష్ణ విగ్రహ ఊరేగింపులో పాల్గొన్న భక్తులు

కొత్తకోట: మండల కేంద్రంలోని శ్రీకృష్ణ మందిరం పునర్నిర్మాణంలో భాగంగా శనివారం విగ్రహాల ప్రతిష్ఠాపన కార్యక్రమం ప్రారంభించారు. ఆలయంలో ప్రతిష్ఠించడానికి సిద్ధంగా ఉన్న శ్రీకృష్ణ, నంది విగ్రహాలకు ప్రత్యేక పూజలు నిర్వహించి పట్టణ పురవీధుల గుండా భారీగా ఊరేగింపు నిర్వహించారు. ఈ సందర్భంగా క్రీ.శే.పాపయ్యగారి కొండారెడ్డి కుమారులు పాపయ్యగారి కృష్ణారెడ్డి శ్రీకృష్ణ ఆలయ కమిటీకి రూ.50 వేల చెక్కును అందజేశారు. అనంతరం శ్రీకృష్ణ మందిరంలో పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో పల్లెపాగు ప్రశాంత్, పీజే బాబు, నాగారపు బీచుపల్లి, పోతులపల్లి శ్రీనివాస్, శేఖర్‌రెడ్డి, ఎస్‌జే బోయేజ్, ఎల్లంపల్లి నరేందర్‌రెడ్డి, సాక బాలనారాయణ, జేసీబీ రాములు, కరెంట్ రాములు, శ్రీనివాస్‌రెడ్డి, నరేందర్‌సాగర్, లక్ష్మయ్య తదితరులు పాల్గొన్నారు.

3న అయ్యప్పస్వామి మహాపడి పూజ



మహాపడి పూజ కరపత్రాలు విడుదల చేస్తున్న మాలధారులు

అమరచింత: అమరచింత పట్టణంలోని శ్రీహరిహర పుత్ర అయ్యప్పస్వామి ఆలయంలో జనవరి 3న మహాపడి పూజ నిర్వహిస్తున్నట్లు గురుస్వామి మాకం నరసింహులు తెలిపారు. మహాపడిపూజ సందర్భంగా ఆలయంలో శనివారం కరపత్రాలు విడుదల చేశారు. ఈసందర్భంగా గురుస్వామి మాట్లాడుతూ 31 ఏళ్లుగా పట్టణంలో క్రమం తప్పకుండా అయ్యప్ప మహాపడి పూజ నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. పూజకు ప్రజాప్రతినిధులతో పాటు పట్టణానికి చెందిన ప్రముఖులను ఆహ్వానిస్తున్నామని తెలిపారు. భక్తులు పూజలో పాల్గొని స్వామివారి తీర్థ ప్రసాదాలను స్వీకరించాలని కోరారు. కార్యక్రమంలో గురుస్వాములు మ్యాడం కృష్ణయ్య, కమలాకర్‌గౌడ్, క్యామ భాస్కర్, రవికాంత్, శివయ్య, మహేందర్, పురేందర్, తెలుగు రమేష్, తోకలి రమేష్, మాలధారులు పాల్గొన్నారు.

వీపనగండ్ల అధ్యాపకుడికి డాక్టరేట్



డాక్టరేట్ పట్టాను అందుకుంటున్న జ్ఞానేశ్వర్

వీపనగండ్ల: మండల కేంద్రానికి చెందిన జ్ఞానేశ్వర్ పాలమూరు యూనివర్సిటీలో రసాయనశాస్త్ర విభాగంలో అధ్యాపకుడిగా పనిచేస్తూ.. ఓయూ ప్రొఫెసర్ పార్థసారధి పర్యవేక్షణలో సింథసిస్ ఆఫ్ న్యూ ఆర్గానిక్ ఛార్జ్ ట్రాన్స్‌ఫర్ కాంప్లెక్స్‌ల సంశ్లేషణ అనే అంశంపై పీహెచ్‌డీ పూర్తి చేయడంతో డాక్టరేట్ పట్టాను పొందారు. ఈ సందర్భంగా వీసీ ఆచార్య శ్రీనివాస్ జ్ఞానేశ్వర్‌ను అభినందించారు. క్యాన్సర్ వ్యాధి నిరోధక మెటీరియల్ సైన్స్‌లో జ్ఞానేశ్వర్ పరిశోధనలు ఎంతగానో ఉపయోగపడుతాయన్నారు. జ్ఞానేశ్వర్‌ను ఓఎస్‌డీ డాక్టర్ మధుసూదన్‌రెడ్డి, ప్రిన్సిపాల్ డాక్టర్ చంద్రకిరణ్, ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ ప్రవీణ, అధ్యాపకులు డాక్టర్ అర్జున్ కుమార్, రవికుమార్, పర్వతాలు, సుదర్శన్‌రెడ్డి, రాజశేఖర్, రామ్మోహన్, రామగౌడ్, స్వామి, మాధురి, కల్పన అభినందించారు.

ప్రకృతివనం తొలగించొద్దని గ్రామస్తుల నిరసన



పల్లె ప్రకృతివనంలో దిమ్మె వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న గ్రామస్తులు

ఖిల్లాఘనపురం: మండలంలోని మల్కిమియాన్‌పల్లిలో సుమారు మూడేళ్ల క్రితం ఏర్పాటు చేసిన ప్రకృతివనాన్ని తొలగించొద్దని శనివారం గ్రామస్తులు నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వం సుమారు రూ.3 లక్షల ఉపాధి హామీ నిధులు ఖర్చు చేసి ప్రభుత్వ స్థలంలో పల్లె ప్రకృతివనం ఏర్పాటు చేశారన్నారు. గ్రామానికి ఆనుకుని ఉన్న సర్వే నెంబర్ 4లో పల్లె ప్రకృతివనం నిర్మించగా అదనంగా ఖాళీ స్థలం ఉన్నప్పటికీ కొందరు నాయకులు కావాలని గ్రామానికి మంజూరైన గ్రామ పంచాయతీ భవనాన్ని ప్రకృతివనం తొలిగించి అదే స్థలంలో నిర్మించాలని చూస్తున్నారని ఆరోపించారు. ఇటీవలే కొందరు నాయకులు వనానికి ఏర్పాటు చేసిన కంచెను, చెట్లను తొలగించారని, వారిపై ఎంపీడీఓ ఎలాంటి చర్యలు తీసుకోలేదని మండిపడ్డారు. అదే స్థలంలో గ్రామ పంచాయతీ భవనం నిర్మాణం కోసం శంకుస్థాపన చేసేందుకు దిమ్మె నిర్మిస్తున్నారన్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి ప్రకృతివనం కంచె, చెట్లను తొలిగించిన వారి చర్యలు తీసుకోవడంతో.. పంచాయతీ భవనాన్ని మరోచోట నిర్మించాలని కోరారు.

గర్భిణులు వైద్యుల సూచనలు పాటించాలి



గర్భిణులకు అవగాహన కల్పిస్తున్న పీహెచ్‌సీ డాక్టర్ చంద్రశేఖర్

పాన్‌గల్: గర్భిణులు తప్పక వైద్యుల సూచనలు పాటించాలని పీహెచ్‌సీ డాక్టర్ చంద్రశేఖర్ అన్నారు. శనివారం మండల కేంద్రంలోని ఆస్పత్రిలో గర్భిణులకు వైద్య పరీక్షలు నిర్వహించి ఆరోగ్యంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా డాక్టర్ మాట్లాడుతూ గర్భిణుల్లో ప్రధానంగా వచ్చే రక్తహీనతతో పాటు రక్తపోటు, మధుమేహం, థైరాయిడ్ సమస్యలను అరికట్టేందుకు ముందుగానే జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. కాన్పు సమయంలో ఎదురయ్యే రిస్క్‌ను తగ్గించేందుకు క్రమం తప్పకుండా మందులు వాడి, వైద్యుల సూచనలు పాటించాలని కోరారు. పండ్లు, ఆకుకూరలు, పోషకాహారం నిత్యం ఆహారంలో భాగం చేయాలని, సమయానికి నిద్రించడం, యోగాసాలు వేయాలని సూచించారు. అత్యవసర సమయంలో 108, 102 వాహనాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. సమావేశంలో ఎంఎల్‌హెచ్‌పీ డాక్టర్ మైథిలీ, సిబ్బంది పాల్గొన్నారు.

‘బలిజపల్లి పంచాయతీగానే కొనసాగించాలి’

ప్రత్యేక గ్రామసభలో అధికారులకు విజ్ఞప్తి



విలీనం ప్రక్రియకు వ్యతిరేకంగా నినాదాలు చేస్తున్న బలిజపల్లి గ్రామస్తులు

కొత్తకోట రూరల్: పెద్దమందడి మండలంలోని బలిజపల్లి గ్రామాన్ని జంగమాయపల్లి పంచాయతీలో విలీనం చేసేందుకు అధికారులు, పాలకులు తీసుకున్న నిర్ణయాన్ని గ్రామస్తులు వ్యతిరేకిస్తున్నారు. ఈ విలీనం గ్రామ అభివృద్ధికి విఘాతం కలిగిస్తుందని గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేశారు. గ్రామ పంచాయతీని విలీనం చేయొద్దంటూ నాలుగు రోజులు వివిధ రూపాల్లో నిరసనలు తెలియజేయడంతో పాటు రాస్తారోకోలు, ధర్నాలు చేపట్టారు. శనివారం మండల ప్రత్యేక అధికారి ఎస్.పుష్ప ఆధ్వర్యంలో డివిజనల్ పంచాయతీ అధికారి రఘునాథ్‌రెడ్డి, ఎంపీడీఓ సద్గుణ ఇతర అధికారుల సమక్షంలో ఇరు గ్రామాల గ్రామస్తులతో గ్రామసభ ఏర్పాటు చేశారు. రెండు గ్రామాలను ఒకే గ్రామ పంచాయతీగా ఉండేవిధంగా చూడాలని జంగమాయపల్లి గ్రామస్తులు ఏకగ్రీవ తీర్మానం చేయగా.. బలిజపల్లిని జంగమాయపల్లిలో విలీనం చేయకుండా గ్రామ పంచాయతీగానే ఉంచాలని బలిజపల్లి గ్రామస్తులు ఏకగ్రీవ తీర్మానం చేశారు. గతంలో జంగామయపల్లి, బలిజపల్లి గ్రామాలు ఒకే పంచాయతీగా ఉండగా, 2018లో బలిజపల్లి ప్రత్యేక గ్రామ పంచాయతీగా మారిందని, అనంతరం గ్రామం ఎంతో అభివృద్ధి చెందిందని గ్రామస్తులు అధికారుల దృష్టికి తీసుకొచ్చారు. తిరిగి విలీనం చేస్తే గ్రామాభివృద్ధి కుంటుపడుతుందని అభిప్రాయపడ్డారు. ఈ సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా స్థానిక ఎస్‌ఐ యుగంధర్‌రెడ్డి ఆధ్వర్యంలో పోలీసులు గట్టి బందోబస్త్ ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ జయంతి, అశ్వత్థామరెడ్డి, విట్టా శశిధర్‌రెడ్డి, సంజీవరెడ్డి, గిరిజాదేవి తదితరులు పాల్గొన్నారు.

విధుల్లో అంకితభావంతో పనిచేయాలి



అమడబాకులలో పోస్టుమేన్ రామకృష్ణను సన్మానిస్తున్న గ్రామస్తులు, యువకులు

వీపనగండ్ల: మండలంలోని రంగవరం ప్రాథమిక పాఠశాలలో 12 ఏళ్లుగా విధులు నిర్వహించిన ప్రధానోపాధ్యాయుడు ఖాసీం, ఉపాధ్యాయుడు సుధాకర్‌ను కాంగ్రెస్ నాయకులు శాలువాలతో సన్మానించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు బిచ్చన్నసాగర్ మాట్లాడుతూ వారందించిన సేవలు విద్యార్థులకు ఎంతో ఉపయోగపడ్డాయన్నారు. ఉపాధ్యాయులు విధుల్లో అంకితభావంతో పనిచేస్తే ఒక తరం బాగుపడుతుందని సూచించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు బాలగౌడ్, పంచాయతీ కార్యదర్శులు జీవిత, బాలశేషు, అంగన్‌వాడీ టీచర్ చంద్రకళ, కాంగ్రెస్ నాయకులు రఘువర్ధన్‌రెడ్డి, స్వామి, చంద్రశేఖర్, సుదర్శన్, చైతన్య తదితరులు పాల్గొన్నారు.

బదిలీపై వెళ్తున్న పోస్టుమెన్‌కు సన్మానం

కొత్తకోట రూరల్: మండలంలోని అమడబాకులలో రెండేళ్లుగా పోస్టుమెన్‌గా పనిచేస్తున్న రామకృష్ణ ఇటీవల పదోన్నతిపై వెళ్తుండగా.. శనివారం గ్రామస్తులు ఆయనను పూలమాలలు, శాలువాలతో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా పలువురు యువకులు, గ్రామస్తులు మాట్లాడుతూ రెండేళ్లుగా గ్రామస్తులకు పోస్టాఫీస్‌లో ఉన్న పథకాలు, బీమా పథకాల గురించి అవగాహన కల్పించడంతో పాటు ప్రతి రోజు క్రమం తప్పకుండా గ్రామంలో అందుబాటులో ఉండి సేవలందించారని గుర్తు చేశారు.

సామాజిక తనిఖీపై ప్రజావేదిక



వివరాలు వెల్లడిస్తున్న డీఆర్‌డీఓ ఉమాదేవి

పాన్‌గల్: మండలంలో ఉపాధి హామీ పథకంలో వివిధ గ్రామాల్లో చేపట్టిన పనులకు ఖర్చు చేసిన నిధులపై నిర్వహించిన 14వ విడత సామాజిక తనిఖీపై శనివారం మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయ ఆవరణలో ప్రజావేదిక నిర్వహించారు. ఈ సందర్భంగా డీఆర్‌డీఓ ఉమాదేవి మాట్లాడుతూ.. మండలంలోని 28 పంచాయతీల్లో 2023 ఏప్రిల్ నుంచి 2024 మార్చి వరకు రూ.5.15 కోట్లు ఖర్చు చేశారన్నారు. మండలంలోని వివిధ గ్రామాల్లో వారం రోజుల పాటు నిర్వహించిన గ్రామసభల్లో కొలతలో వ్యత్యాసం, అదనపు డబ్బులు చెల్లింపులు, తక్కువ పనులకు అదనపు రికార్డులు చేయడం, పనులు జరిగిన వాటికి ఫొటోలు ఇవ్వకపోవడం, హరితహారంలో నాటిన మొక్కలు రికార్డులో ఉన్న సంఖ్యకు, ఫీల్డ్‌లో ఉన్న సంఖ్యకు వ్యత్యాసాలు ఉండటం, కొన్ని గ్రామాల్లో పనులకు సంబంధించిన పలు రికార్డులు చూపకపోవడం వంటి అవకతవకలు జరిగినట్లు సామాజిక తనిఖీలో తేలిందన్నారు. మండలంలో మొత్తం సామాజిక తనిఖీలో రూ.22,500 జరిమానా, రూ.5,380 రికవరీ కలిపి మొత్తం రూ.27,880 నిధులు అవకతవకలు జరిగినట్లు వెల్లడించారు. ఆయా డబ్బులను ఆయా గ్రామాల ఉపాధి సిబ్బంది నుంచి రికవరీ చేయనున్నట్లు ఆయన పేర్కొన్నారు. సమావేశంలో ఏపీఓ రహీం, అంబుడ్స్‌మెన్ జిల్లా సభ్యుడు సత్యనారాయణరెడ్డి, ఏక్యూసీ హరిత, ఎంపీడీఓ గోవింద్‌రావు, ఎంపీఓ రఘురాములు, ఏపీఓ కుర్మయ్య, సామాజిక తనిఖీ, ఉపాధి సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.


పాన్‌గల్ ‘ఖిల్లా’పై గుప్తనిధుల కోసం తవ్వకాలు



పాన్‌గల్ ఖిల్లా గుట్టపై దర్గా సమీపంలో తవ్వకాలు జరిపిన ప్రదేశం

పాన్‌గల్: మండల కేంద్రంలోని గుట్టపై గుప్త నిధుల కోసం గుర్తు తెలియని వ్యక్తులు అనేక చోట్ల తవ్వకాలు జరిపిన విషయం శనివారం వెలుగులోకి వచ్చింది. గుట్టపై ఉన్న చారిత్రక కట్టడాలు, దర్గాల సమీపంలో పెద్ద ఎత్తున తవ్వకాలు జరుపుతూ కట్టడాలను ధ్వంసం చేస్తున్నారు. ఇలాంటి ఘటనలు పునరావృత్తం కాకుండా పురావస్తుశాఖ, పోలీసులు గట్టి నిఘా ఏర్పాటు చేసి, నిందితులను కఠినంగా శిక్షించాలని స్థానికులు కోరుతున్నారు. గుట్టపై తవ్వకాలను నిరోధిస్తూ చారిత్రక కట్టడాలను కాపాడాలని మండల ప్రజలు కోరుతున్నారు.

కార్మికుల సమస్యలు పరిష్కరించాలి



ధర్నా చేస్తున్న కార్మికులు

వనపర్తి రూరల్: కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల ముందు పంచాయతీ కార్మికులకు ఇచ్చిన హామీలను పరిష్కరించాలని తెలంగాణ గ్రామ పంచాయతీ ఉద్యోగ, కార్మిక సంఘాల జేఏసీ (సీఐటీయూ అనుబంధంతో) రెండో రోజు నాయకులు సూర్యవంశం రాము, ఏదుట్ల కురుమయ్య అధ్యక్షతన శనివారం జిల్లా కేంద్రంలోని మర్రికుంట నుంచి ర్యాలీగా వెళ్లి కలెక్టరేట్ వద్ద ధర్నా చేశారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథులుగా సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు బొబ్బిలి నిక్సన్, కోశాధికారి రాజు, ఆర్ఎన్ రమేష్, గ్రామ పంచాయతీ వర్కర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి గణేష్ మాట్లాడుతూ.. గ్రామ పంచాయతీ కార్మికులు దశల వారీగా ఆందోళన చేసిన, చలో అసెంబ్లీ కార్యక్రమం చేపట్టినా ప్రభుత్వం నిమ్మకునీరెత్తినట్లు వ్యవరిస్తుందన్నారు. టోకెన్ సమ్మె ద్వారా అయినా గ్రామ పంచాయతీ సిబ్బంది సమస్యలు పరిష్కారం కావాలని కోరారు. జనజ్వాల, ఎస్సీ, ఎస్టీ మానిటరింగ్ కమిటీ సభ్యుడు గంధం నాగరాజు సమ్మెకు మద్దతు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు హనీఫ్, ఎల్లయ్య, శ్రీను, కురుమయ్య, సుగ్రీవుడు, వెంకటయ్య, గట్టమ్మ, పుష్ప, గోవిందమ్మ, కార్మికులు పాల్గొన్నారు.